ఆ రెండు పార్టీలను పక్కన పెట్టండి

- పోలయ్యే ప్రతీ 2 లక్షల ఓట్లలో 1.25 లక్షల ఓట్లు కాంగ్రెస్‌కు వేయించాలి
- కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విజ్ఞప్తి



పటాన్‌చెరు సమీపంలోని పాటి వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి



జగ్గారెడ్డికి బోకేను అందజేస్తున్న నాయకులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 18 : ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను పక్కన పెట్టి కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి కోరారు. పటాన్‌చెరు సమీపంలోని పాటి వద్ద ఓ ఫంక్షన్‌హాలులో గురువారం జరిగిన సమావేశంలో ఆయన బీఆర్ఎ‌స్‌కు చెందిన పలువురు ప్రజానిధులకు కండువాలు కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పోలయ్యే ప్రతీ 2 లక్షల ఓట్లలో 1.25 లక్షల ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థికి వేయించాలని, అప్పుడే కాంగ్రెస్ సత్తా ఏమిటో ఇతర పార్టీలకు తెలుస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడం తథ్యం అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో తాగునీటి సమస్య పరిష్కారం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
- కృతజ్ఞతలు తెలిపిన గిరిజనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్కన్నపేట, ఏప్రిల్ 18: అక్కన్నపేట మండలంలోని పలు గిరిజన తండాల్లో తాగునీటి సమస్యపై ఈనెల 16న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో "గొంతెండుతోంది!" శీర్షికన ప్రచురితమైన కథనానికి మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పంచాయతీ శాఖ అధికారులు స్పందించారు. ఆయా తండాల్లో మిషన్ భగీరథ నీటిని ట్యాంక్‌ల్లోకి నీటిని ఎక్కించేందుకు బూస్టర్ మోటర్లు ఏర్పాటు చేశారు. మరోసారి నీటి సమస్య తలెత్తకుండా పలువురి రైతుల బోర్లు, బావులను అద్దెకు తీసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో పలుతండాల గిరిజనులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అధికారులు హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండలాల్లో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులదే అన్నారు. సమావేశంలో జిల్లాపంచాయతీ అధికారి దేవకిదేవి, మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ీలు అమరేందర్, శ్రీనివాసచారి, డీఈలు బాలరాజు, రుహినాతస్కిన్, డీఎల్పీవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మంచిగానాయక్ తండాలో తాగునీటి సమస్యపై గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

ఇక సమరమే!

- పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- మొదలైన నామినేషన్ల ఘట్టం
- తొలిరోజు జహీరాబాద్‌కు ఒకటి, మెదక్‌కు నాలుగు నామినేషన్లు దాఖలు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 18 : నామినేషన్ల ఘట్టం ప్రారంభం కావడంతో పార్లమెంటు ఎన్నికల రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఎన్నికల కదన రంగంలో ప్రచార సునామీ మొదలవనున్నది. బరిలో ఉన్న తమ పార్టీ అభ్యర్థుల విజయానికి అధినేతలు తరలివస్తున్నారు. ఇప్పటికే మెదక్ లోకసభ సెగ్మెంట్‌కు సంబంధించి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను ప్రకటించి బీఫామ్‌లను సైతం అందజేశాయి. నామినేషన్ల సమర్పణ నుంచే భారీ బలప్రదర్శన చేపట్టేలా అభ్యర్థులు ప్రణాళిక రచించుకున్నారు. అట్టహాస ప్రచార హోరుతో లోక్‌సభ సమరం తారాస్థాయికి చేరనున్నది.

మెదక్ లోకసభ నియోజకవర్గంపై ప్రధాన పార్టీలన్నీ దృష్టి సారించాయి. 2004 నుంచి 2019 ఎన్నికల దాకా బీఆర్ఎస్ ఖాతాలోనే ఉన్న ఈ స్థానాన్ని మరోసారి నిలబెట్టుకోవాలని ఆ పార్టీ సర్వశక్తులు ఒడ్డుతోంది. ఇక మెదక్ పార్లమెంటులో 18 సార్లు ఎన్నికలు జరిగితే 9 దఫాలుగా విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ సైతం మళ్లీ దక్కించుకునేందుకు ఫోకస్ పెట్టింది. కేంద్రంలో హ్యాట్రిక్‌పై దృష్టిపెట్టిన బీజేపీ కూడా ఈ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది.

అధినేతల రాకతో హోరెత్తనున్న ప్రచారం

ఇప్పటికే గులాబీ బాస్ కేసీఆర్ సభ

తాజాగా గోవా సీఎం కార్నర్ మీటింగ్

రేపు మెదక్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మోదీ, అమిత్‌షా, రాహుల్ సభలు

మరో సభకు కేసీఆర్ ప్లాన్

మెదక్ లోకసభ పరిధిలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గాలకు సంబంధించి ఇటీవల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో బహిరంగసభ నిర్వహించారు. మూడు నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేసి తమ సందేశం వినిపించారు. ఇక మెదక్, దుబ్బాక, గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాల ప్రజలు, కార్యకర్తలతోనూ మరో బహిరంగ సభను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ నాలుగు నియోజకవర్గాల్లో అనుకూలంగా ఉన్న చోట సభను ఏర్పాటు చేయనున్నారు. అప్పటివరకు మాజీ మంత్రి హరీశ్‌రావు ఆ పార్టీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరపున ప్రచారం చేయనున్నారు. మండలాలు, పట్టణాలవారీగా సభలు, రోడ్‌షోలు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

రాహుల్‌తో బహిరంగ సభ

మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ సందర్భంగా రేపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై సభలో పాల్గొననున్నారు. ఆ తర్వాత మిగతా ఆరు నియోజకవర్గాల్లో ఒకచోట జరిగే సభకు రేవంత్ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ స్థానంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతోనూ బహిరంగ సభకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రియాంక గాంధీతోపాటు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలతో రోడ్‌షోలు కూడా నిర్వహించనున్నట్లు తెలిసింది. స్థానికంగా మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, మైనంపల్లి హనుమంతరావు అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తున్నారు.

మోదీ, అమిత్‌షా సభలు

గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ ఈ లోకసభ నియోజకవర్గ పరిధిలోని తూప్రాన్‌లో సభ నిర్వహించారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ నరేంద్రమోదీతో భారీ బహిరంగ సభను తలపెట్టడానికి ఆ పార్టీ సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. అదే విధంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్‌షాలతోనూ సభలు, లేదా కార్నర్ మీటింగ్‌లను ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు నామినేషన్ సందర్భంగా మెదక్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు గోవా సీఎం ప్రమోద్ సావంత్ హాజరయ్యారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు, కీలక నేతలు మెదక్ లోకసభ నియోజకవర్గాన్ని చుట్టేయనున్నారు.



ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి రఘునందర్‌రావు

తొలిరోజే బోణి

మొదటిరోజు నామినేషన్లు	
మెదక్	4
జహీరాబాద్	1

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్ల ప్రక్రియకు తెరలేచింది. సంగారెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెదక్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అనంతరం నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. తొలిరోజు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక నామినేషన్ దాఖలయ్యింది. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. తొలి రోజు కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ తరపున ఆయన అనుచరులు సాగర్‌తో పాటు నలుగురు కార్యకర్తలు ఒక్క సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. మెదక్ లోక్‌సభ స్థానానికి మెదక్ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించారు. తొలిరోజు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరఫున మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థి దొడ్డ వెంకటేశం, స్వతంత్ర అభ్యర్థి చిక్కుపల్లి నవీన్‌కుమార్ తమ నామినేషన్లు సమర్పించారు. నలుగురు అభ్యర్థుల తరఫున ఐదు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.





మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరఫున నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ తరఫున సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఆ పార్టీ నాయకులు

నో ఎంట్రీ..!

మునుపెన్నడూ లేని భద్రతా చర్యలు



కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద భారీ సంఖ్యలో బలగాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 18 : నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కాగా, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయమైన సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద మునుపెన్నడూ లేనివిధంగా భద్రతా చర్యలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో, కలెక్టరేట్ నుంచి సంగారెడ్డిలోకి వెళ్లే దారిలో 500 మీటర్ల దూరంలోనే బారికేడ్లను పెట్టేశారు. కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు. కలెక్టరేట్‌కు పనుల కోసం వచ్చే సాధారణ ప్రజలను రానివడం లేదు. మీడియా ప్రతినిధులను ఎంట్రెన్స్ వద్ద ఏర్పాటు చేసిన షామియానా వరకు మాత్రమే అనుమతించారు. కనీసం డీపీఆర్వో కార్యాలయంలోకి వెళ్లనీయడం లేదు. జిల్లాస్థాయి అధికారుల వాహనాలను కూడా లోపలికి అనుమతించకపోవడం గమనార్హం. జిల్లాస్థాయి అధికారులు కూడా పోలీసులకు తమ గుర్తింపు కార్డులను చూపించి కలెక్టరేట్‌లోకి వెళ్లాల్సి వస్తోంది. దశాబ్దాల కాలంగా ఎన్నికలు జరుగుతున్నా ఇలాంటి భద్రతా చర్యలు మునుపెన్నడూ కనిపించలేదని పలువురు అధికారులే అంటున్నారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రంగా కొనసాగిన సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ మెదక్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా, జాయింట్ కలెక్టర్ జహీరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారిగా పనిచేశారు. ఆ సమయంలోనూ ఇంతటి అసాధారణ భద్రతా చర్యలు లేవని, అయినా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగిందని జిల్లా స్థాయి అధికారి ఒకరు గుర్తుచేశారు.



కలెక్టరేట్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే దారిని మూసివేసిన పోలీసులు

రేవంత్‌వి తుపాకీరాముడి మాటలు

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



బెజ్జంకిలో ఎన్నికల ప్రచారసభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

బెజ్జంకి, ఏప్రిల్ 18: సీఎం రేవంత్ రెడ్డివి తుపాకీరాముడి మాటలని, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో గురువారం రాత్రి బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో కరీంగనర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బాలకిషన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ వచ్చిన నాలుగు నెలల్లోనే రైతులను ఆగం చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కరువు తెచ్చిందన్నారు. పథకాల పేరుతో ప్రజలను మోసం చేసి రేవంత్‌రెడ్డి గద్దెక్కారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వాళ్లు మళ్లీ ఓట్లు అడగడానికి వస్తే చీపుర్లు, చాటలు పట్టుకుని సిద్ధంగా ఉండాలన్నారు. మోసం చేసిన కాంగ్రెస్‌కు మళ్లీ ఓటు వేస్తే ప్రజలు గోస పడతారని పేర్కొన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రైతులు పండించిన పంట చివరి గింజ వరకు కొనుగోలు చేసి, రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేశామని గుర్తుచేశారు. వడ్లకు బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు ఏమయ్యాయని ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రతి పెన్షన్ దారునికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 8వేలు బాకీ పడిందని, కోటి 42 లక్షల మంది ఆడబిడ్డలను మోసం చేస్తుందని, లక్షా సాయం తులం బంగారం ఏమైందని మండిపడ్డారు. బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం ఏమి చేయలేదని, ఆయనది పబ్లిసిటీ తప్ప పని చేసేంది ఏమీ లేదని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తే పెనం మీద నుంచి పొయ్యిలో పడట్టు అవుతుందన్నారు. చెప్పుకోవడానికి పథకాలు లేక ఇంటింటికి చిత్ర పటాలను పంచుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఉండదని కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడారు. కార్యక్రమంలో టీస్కాబ్ చైర్మన్ కోదూరి రవీందర్‌రావు, ఎంపీపీ నిర్మల, పార్టీ మండలాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్యంతో ఆటలు..!

- ప్రైవేట్‌లో అర్హత లేకున్నా వైద్యం
- అదుపు లేకుండా ఫీజు వసూలు
- అదనపు బాదుడుతో ఆగమాగం



సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 18: జిల్లా కేంద్రానికి చెందిన ఒకరు భుజం నొప్పితో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యం అందించాల్సిన ఆర్థోపెడిక్ డాక్టర్ అందుబాటులో లేరు. అయితే, అక్కడి సిబ్బంది డాక్టర్ లేరని.. ఆయన బదులుగా ఓ వైద్యురాలు చికిత్స చేస్తారని చెప్పారు. సరేనని సదరు డాక్టర్‌గా చెప్పిన మహిళ వద్దకు వెళ్లగా ఆమె వైద్యం చేసి పంపించారు. అలా వైద్యం చేసిన మహిళ డాక్టర్ కాదు.. ఫిజియోథెరపిస్ట్. వాస్తవానికి ఫిజియోథెరపిస్ట్ వైద్యం చేయకూడదు. డాక్టర్ ప్రిస్కిప్షన్ ప్రకారం ఫిజియోథెరపీ సేవలు మాత్రమే అందించాలి. కానీ, సదరు మహిళ ఏకంగా వైద్యం చేయడం గమనార్హం.

ఇది సిద్దిపేట జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరుగుతున్న తంతు.. అర్హత లేకున్నా కొందరు డాక్టర్లుగా చెలామణి అవుతూ రోగులు, బాధితుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తమకు అర్హత లేకున్నా.. వచ్చి రానీ వైద్యం చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ పరిధిలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో టీఎస్ఎంసీ తనిఖీలు చేసింది. అర్హత లేని వారిని డ్యూటీ మెడికల్ ఆఫీసర్లుగా(డీఎంవో) నియమిస్తున్నట్లు, డీఎంవోలుగా ఆయూష్ డాక్టర్లు, ఫాం డీ డిగ్రీ చేసిన వారిని నియమిస్తున్నట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో సిద్దిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రులను పరిశీలించగా.. అనర్హులు వైద్యం చేస్తున్న వైనం బయట పడింది. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో కంపౌండర్లు కూడా వైద్యుల అవతారమెత్తుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కేంద్రంగా మారడంతో పట్టణంతో పాటు చుట్టు పక్కల ఇతర జిల్లాల నుంచి వివిధ వైద్య చికిత్సల కోసం వందలాది మంది రోజూ ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారికంగా 130 ప్రైవేట్ ఆస్పత్రులు ఉండగా, ఒక్క సిద్దిపేట పట్టణంలోనే దాదాపు 70 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. ఇక ఆర్ఎంపీలు.. పీఎంపీలు కూడా వైద్యం చేస్తున్నారు. మెరుగైన వైద్యం అందుతుందన్న భరోసాతో జనం ఆస్పత్రులకు క్యూ కడుతుండగా.. అనర్హులు వైద్యం చేస్తున్నారని తెలియడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ ఫీజులు

సిద్దిపేటలో పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లోకి అవుట్ పేషెంట్‌లో వైద్య పరీక్షల కోసం రూ. 300 నుంచి రూ. 400 వరకు వసూలు చేస్తున్నారు. కానీ, కొన్ని ఆస్పత్రుల్లో మాత్రం స్పెషలైజేషన్ పేరిట అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్నారు. ఫిజియోథెరపిస్ట్ వైద్యం అందించిన ఆస్పత్రిలో ఏకంగా రూ. 500 వసూలు చేయడం గమనార్హం. దాంతో పాటు అవసరం లేకున్నా ఎక్స్‌రే పేరిట, ఫిజియోథెరపీకి రూ. 300 అంటూ వసూలు చేస్తున్నారు. ఇక మందుల విషయం అయితే, చిన్న పాటి సమస్యకే వేలల్లో మందులు రాస్తుండటంతో ఆస్పత్రులంటేనే అమ్మో అనే పరిస్థితులు వస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులను పర్యవేక్షించాల్సిన వైద్య అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కేంద్రంగా మారడంతో పుట్టగొడుగుల్లా కొత్తఆస్పత్రులు పుట్టుకువస్తున్నాయి. వీటిలో ఎన్నింటికి అనుమతులు ఉన్నాయో.. ఎన్ని ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేస్తున్నారో తెలియని పరిస్థితి. అనర్హులూ వైద్యం చేస్తున్న ఉదంతాలు బయటపడుతున్నా.. కనీస తనిఖీలు కూడా చేయడం లేదని బాధితులు అంటున్నారు.

ఆరోగ్యశ్రీ ఆలస్యమవుతుందని..


జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాద బారిన పడిన వారు అత్యవసర వైద్య చికిత్సలు పొందేందుకు ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా సేవలందించాలని వస్తే, కొన్ని ఆస్పత్రుల వారు దానిని అవకాశంగా మలచుకుంటున్నారు. ఆరోగ్య శ్రీ అనుమతులు వచ్చేందుకు ఆలస్యం అవుతుందని, అత్యవసరంగా చికిత్స అందించాలని డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అలాగే, ఆరోగ్య శ్రీ కింద 50 శాతం మాత్రమే డబ్బులు వస్తాయంటూ కూడా బాధితుల నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

బస్ ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి

జీడిమెట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులకు టిఫిన్ తీసుకురావడానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామాం మహదేవ్‌పురం వద్ద గురువారం ఉదయం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌కు ఏషబోయిన రాములు గాజులరామారం మల్లారెడ్డినగర్, షిర్డీహిల్స్‌లో ఓఅపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు లక్ష్మణ్ (19)తో కలిసి అక్కడే నివాసముంటున్నారు. లక్ష్మణ్ లేపాక్షి కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులకు అల్పాహారం తీసుకురావడానికి తండ్రి స్కూటీపై వెళ్లాడు. మల్లారెడ్డినగర్ వైశాలి టింబర్‌డిపో వద్ద ఓ ప్రైవేట్‌బస్ డ్రైవర్ వేగంగా నడుపుకుంటూ వచ్చి వెనుక నుంచి లక్ష్మన్‌ను ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

పంజాగుట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని మాజీమంత్రి, సినీనటుడు బాబుమోహన్ పేర్కొన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా పని చేస్తూ వెయ్యికి పైగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన మెదక్ జిల్లాకు చెందిన డాక్టర్ సింగం శ్రీనివాసరావుకు ఆర్బీఎల్ బ్యాంక్ కమ్యూనిటీ స్టార్ అవార్డును ప్రకటించింది. గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులతో కలిసి సింగం శ్రీనివాసరావుకు ఆయన అవార్డును అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని కుగ్రామం రాయల్‌పల్లికి చెందిన శ్రీనివాసరావు వేలాది మందికి సహాయం చేయడం గొప్ప విషయమని కొనియాడారు.

బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫాంలు

జహీరాబాద్, మెదక్ లోక్‌సభ స్థానాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్, వెంకట్రామారెడ్డిలకు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం బీఫాంలు అందజేశారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జహీరాబాద్ మాణిక్‌రావు, సునితా లక్ష్మారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజూశ్రీ జైపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్‌రెడ్డి ఉన్నారు.

కన్నపేగు కోసం..

ఎక్కడ ఎదురుకాల్పులు జరిగినా.. ఆ తల్లికి ఎదురుచూపులే..!




- 22 సంవత్సరాలుగా తల్లడిల్లుతున్న తల్లి
- నా చావుకైనా వస్తుందో రాదో..
- మావోయిస్టు భాగ్య తల్లి ఎల్లవ్వ ఆవేదన

దుబ్బాక, ఏప్రిల్ 18: 'తొలిచూలు బిడ్డ అని కూలి చేసి పెంచినం.. కాలు వంకరైతే బొంబాయిలో 15 రూపాయిల కూలి చేసుకుని బాగు చేసుకున్నాం. 22 ఏండ్ల కిందట చవితి పాశం తిని గడపదాటిన బిడ్డ మళ్లీ కంటికి కనిపించలేదు. అదేదో దేశంలో 30 మంది అన్నలు తెలంగాణోల్లే చనిపోయింర్రనగానే గుండె గుబేలుమన్నది. చనిపోయిన వాళ్లలో నా బిడ్డ ఉందేమోనని టీవీల చూస్తుంటే పానం ఆగమైంది'.. అంటూ సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం దర్మారం గ్రామానికి చెందిన మావోయిస్టు రెడ్డబోయిన భాగ్య తల్లి ఎల్లవ్వ ఆవేదన ఇది. ఛత్తీస్‌గఢ్‌లో రెండ్రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారని తెలియడంతో ఆమె తన బిడ్డ జాడ కోసం తల్లడిల్లుతున్నది. 2002లో దుబ్బాక దళంలో చేరిన రెడ్డబోయిన భాగ్య అలియస్ కల్పన, అలియస్ మాధవి, అలియస్ రూపి.. 22 ఏళ్ల నుంచి మావోయిస్టు పార్టీలోనే కొనసాగుతున్నారు. మావోయిస్టు దుబ్బాక దళం పూర్తిగా నిర్వీర్యమైన ప్రతికూల పరిస్థితిలో ఆమె పార్టీలో చేరారు. అప్పట్లో నిరక్షరాస్యురాలయిన ఆమె ప్రస్తుతం పోలీసుల వద్ద ఉన్న సమాచారం ప్రకారం ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో ప్రజలను ప్రభావితం చేసే బోధనలు చేయడంతోపాటు, నిరక్ష్యరాస్యులకు పాఠాలు చెప్పడంలో కీలకంగా పని చేస్తున్నారని తెలుస్తున్నది. ఆమెకు 15 సంవత్సరాల క్రితం కర్నూలు జిల్లాకు చెందిన చిన్నన్న అలియస్ విజయ్ (ఆర్‌కేబీ కార్యదర్శి)తో వివాహం జరిగినట్లు పోలీసులు ప్రకటించారు. అంతకుమించి ఆమె గురించి సమాచారం నిఘావర్గాల వద్ద లేదు.


భాగ్య (ఫైల్)

22 సంవత్సరాలుగా అజ్ఞాతంలో..

పీపుల్స్‌వార్, జనశక్తి, ప్రస్తుత మావోయిస్టు ఉద్యమాలకు ఉమ్మడి మెదక్ జిల్లా నాలుగు దశాబ్దాలు వేదికగా ఉంది. దుబ్బాక, నర్సాపూర్, గిరాయిపల్లి, ఇందుప్రియల్ దళాలు పీపుల్స్‌వార్‌లో చురుకుగా పనిచేసేవి. జిల్లాలో 1975లో దేశంలోనే మొదటి ఎన్‌కౌంటర్ జరిగింది. జనశక్తి పార్టీ విడివడిన అనంతరం కూడ వెల్లి, మంజీరా దళాలు పనిచేశాయి. గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ తరువాత నర్సాపూర్, ఇందుప్రియల్, దుబ్బాక మావోయిస్టు దళాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. 1995 నుంచి 2000 సంవత్సరం వరకు విప్లవపార్టీలకు ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. అదే సమయంలో రెడ్డబోయిన భాగ్య మావోయిస్టు పార్టీలో చేరారు. 22 సంవత్సరాలుగా అజ్ఞాతంలో ఉన్న ఆమె తన సమాచారం పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తపడుతూ మావోయిస్టు పార్టీలో కీలకంగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా కూడా దర్మారంలో ఉండే తల్లి ఎల్లవ్వ, చెల్లెళ్లు మమత, కవిత, తమ్ముడు కుమార్ ఆందోళన చెందుతుంటారు. ఎప్పుడు.. ఏ చేదు కబురు వస్తుందోనని భయపడుతుంటారు.


Rangaboina Bhagya @ Kalpana @ Madhavi @ Rupi, D/o Chinthamadaka Narsaiah, W/o Suluguri Chinnana @ Vijay, Secretary, RKB DVC, Athmakur (M), Kurnool (AP). Age 38/2021 yrs, Caste Mudiraj (BC), Dharmaram (V), Mirdoddi (M&PS), Siddipet district, UG from 2004. ACM Status, RKB DVC, DKSZC Rs.4,00,000

పోలీసుల వాంటెడ్ లిస్టులో మావోయిస్టు భాగ్య వివరాలు

గడపదాటిన బిడ్డ మళ్లీ కానరాలే



తొలిచూలు బిడ్డ భాగ్య పుట్టగానే కాళ్లు వంకర ఉండేవి. బాగు చేయించడం కోసం మా ఆయన నర్సింహులు, నేను ఎన్నో దవాఖానాలు తిరిగినం. పొట్ట చేత పట్టుకుని బొంబాయి పోయి 15 రూపాయాల కూలీ చేసుకున్నం. కడుపుకు తినకుండా దాచుకుని బిడ్డ కాళ్లు బాగుచేయించినం. 22 ఏళ్ల కిందట చవితి పండుగ రోజు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆరు నెలల తరువాత పోలీసులు వచ్చి బిడ్డ వివరాలు అడిగితేనే ఆమె అన్నల్లో కలిసిందని తెలిసింది. ఐదేళ్ల కిందట ఆమె తండ్రి నర్సింహులు చనిపోయాడు. తండ్రిని ఆఖరుసారి చూడడానికి వస్తుందని ఎదురుచూసినా రాలేదు. ఏడేళ్ల క్రితం మా అత్త చనిపోయినప్పుడు కూడా వస్తుందనుకున్నా రాలేదు. ఒక్కసారి గడప దాటి పోయిన బిడ్డ కంటికి కానరాలేదు. నా ఆరోగ్యం కూడా బాగాలేదు. నా చావుకైనా వస్తుందో.. లేదో..! బిడ్డను చూడాలనిపించినా ఏ అడవిల వెతకాలే? ఎక్కడున్నదని చూడాలే? టీవీల్లో ఎప్పుడు చెడ్డ వార్త వచ్చినా గుండె ఝల్లుమంటది. బిడ్డ కంటే ముందే నేను లోకం విడచిపోవాలనీ రోజూ దేవున్ని మొక్కుతున్నా.

-ఎల్లవ్వ, భాగ్య తల్లి

విప్లవోద్యమాలకు కాలం చెల్లింది



దుబ్బాక సర్కిల్ పరిధిలో దర్మారానికి చెందిన రెడ్డబోయిన భాగ్య ఒక్కరే మావోయిస్టు పార్టీలో ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో ముగ్గురు అజ్ఞాతంలో ఉన్నప్పటికీ భాగ్య కీలకంగా పనిచేస్తున్నారు. ఆమె పేరిట రూ. 4 లక్షల రివార్డు కూడా ఉంది. ప్రస్తుత కాలంలో విప్లవోద్యమాలకు కాలం చెల్లింది. అడవిలో ఉండి సాధించేదేమీలేదు. అజ్ఞాతంలో ఉండి సాధించేదేమీ లేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసకు తావులేదు. ప్రభుత్వాలు కూడా ఉపాధి మార్గాలను పెంచాయి. భాగ్య లొంగిపోతే వృద్ధాప్యంలో ఉన్న తల్లిని చూసుకుంటూ జనజీవనస్రవంతిలో ఉండొచ్చు. ఆమెకు ఉపాధి కల్పిస్తాం. ఆమె కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వానికి విన్నవిస్తాం.

-శ్రీనివాస్, దుబ్బాక సీఐ

నా ఆత్మహత్యకు కారకులను శిక్షించండి

- కలకలం రేపిన ముస్లాపూర్ యువకుడి సెల్ఫీ వీడియో
- సెల్ టవర్ ఆధారంగా గుర్తించిన పోలీసులు


వంశీ

అల్లాదుర్గం, ఏప్రిల్ 18: 'బంధువులే నన్ను మోసం చేశారు.. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నా.. నా చావుకు కారకులైన వారిని వదలొద్దు'.. అంటూ పోలీస్ అధికారులకు విన్నవిస్తూ ఓ యువకుడు సెల్ఫీ వీడియోను విడుదల చేయడం అల్లాదుర్గం మండలంలో కలకలం రేపింది. ఇందుకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు.. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప వంశీ గురువారం సాయంత్రం ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. సమీప బంధువులు తనను మోసం చేయడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగానని, ఉరి కూడా వేసుకోబోతున్నానని పేర్కొంటూ విడియోను విడుదల చేశారు. దీంతో పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆయన కోసం గాలించారు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారించిన పోలీసులు వంశీ సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా ముస్లాపూర్‌లోని చెరువు కట్ట వద్ద అతడు ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

ఎమ్మెల్యే వాహనం తనిఖీ


మెదక్ ఎమ్మెల్యే రోహిత్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్సాపూర్, ఏప్రిల్ 18: నర్సాపూర్ సమీపంలోని మల్లన్నగుడి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు మెదక్ ఎమ్మెల్యే రోహిత్ వాహనాన్ని గురువారం తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి మెదక్ వెళ్తున్న క్రమంలో చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఎమ్మెల్యే సహకరించారు.

రసాయనశాస్త్ర విభాగంలో 26, 27న జాతీయస్థాయి వర్క్‌షాప్

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 18 : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కాలేజీ రసాయనశాస్త్ర విభాగాధిపతి, వర్క్‌షాప్ కన్వీనర్ వాసం శ్రీనివాస్ తెలియజేశారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్, వర్క్‌షాప్ చైర్మన్ ప్రొఫెసర్ ప్రసాద్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌తో విద్యార్థులకు, అధ్యాపకులకు ఉపయోగముంటుందని తెలిపారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలకిషన్, పరీక్షల నియంత్రణ అధికారి సుదర్శనం, రసాయనశాస్త్ర అధ్యాపకులు కె.ఆంజనేయులు, జి.రవికుమార్, పినుమలత, ఎం.శ్యామ్‌సుందర్, ఎండీ సలీంపాషా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ద్రోహం చేసిన చరిత్ర సునీతారెడ్డిది

మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్


విలేకరులతో మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్, ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 18: కాంగ్రెస్‌లో ఉన్నత పదవులను అనుభవించి రాజకీయ స్వార్థం కోసం పార్టీ వీడిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇప్పుడు కాంగ్రెస్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి పేర్కొన్నారు. నర్సాపూర్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. నోటీసు ఇవ్వకుండానే సస్పెండ్ చేశారని, అందుకే పార్టీ మారానని సునీతారెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీని వీడాలనే ఆలోచనతోనే అప్పట్లో బీఆర్ఎస్ ముఖ్య నేతలతో చర్చలు జరపలేదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఉన్న సునీతారెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు అమలు చేస్తున్నామని, లోక్‌సభ ఎన్నికల అనంతరం మిగిలినవి కూడా అమలుచేసి చూపుతామని స్పష్టం చేశారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. అందుకు నర్సాపూర్‌లోని డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయమే నిదర్శనమని పేర్కొన్నారు. బీజేపీని తెలంగాణ ప్రజలు ఆదరించరని అన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బీజేపీ గల్లంతవడం ఖాయమని పేర్కొన్నారు. మెదక్ పార్లమెంటు అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం ప్రతీ ఒక్క కార్యకర్త కూడా కష్టపడాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ.. అదే సమయంలో బీఆర్ఎస్, బీజేపీల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేరికతో కాంగ్రెస్‌లో మరింత బలోపేతమయ్యిందని అన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీ జ్యోతి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, సుదర్శన్‌గౌడ్, మల్లేశంగౌడ్, శ్రీనివాస్‌రావు, మహిళ విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జి సుజాత, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు మణిదీప్, నాయకులు హబీబ్‌ఖాన్, దుర్గారెడ్డి, రిజ్వాన్, రషీద్, సాగర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

20న సీఎం రేవంత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

20న మెదక్ పార్లమెంటు అభ్యర్థి నీలం మధు నామినేషన్ దాఖలు చేయనున్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నందున నర్సాపూర్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆవులరాజిరెడ్డిలు పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు


నిజాంపేట మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

అకాలవర్షం.. ఆగమాగం

నిజాంపేట, ఏప్రిల్ 18: ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షానికి నేలపాలు కావడంతో అన్నదాతలు ఆగమవుతున్నారు. ఆరు నెలలు వ్యయప్రయాసలకోర్చి పండించిన పంట చేతికి వచ్చిన అనంతరం తడిసి ముద్దయి పనికిరాకుండా పోతున్నదని రైతులు వాపోతున్నారు. మండలంలో బుధవారం అర్ధరాత్రి కురిసిన గాలివానకు రోడ్లపై ఆరబోసిన, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేర్చిన ధాన్యం నీటి పాలైంది. ఓవైపు భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్న తరుణంలో.. అష్టకష్టాలు పడి దక్కించుకున్న పంటలు నేలపాలవుతుండడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. 20 రోజుల క్రితం రాళ్ల వర్షం కురిసి వరి గింజలు నేలరాలాయి. పంట నష్టం వివరాలు సేకరించి పరిహారం అందజేయాలని కోరారు.

కేంద్రాలు తెరిచినా కొనుగోళ్లు లేవు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట కోతలు పూర్తయిన సమయంలో వరి ధాన్యం తడిసి ముద్దయ్యాయని రైతు పంజా శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా కొనుగోళ్లు ప్రారంభించలేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి వారం గడుస్తున్నా కొనుగోళ్లు లేక వర్షాలు తడుస్తున్నదని వాపోయారు.


టార్పాలిన్ లేక కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం

మహిళా సాధికారతే బీజేపీ లక్ష్యం

- మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి

టేక్మాల్, ఏప్రిల్ 18: మహిళా సాధికారతే లక్ష్యంగా బీజేపీ పని చేస్తుందని మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి పేర్కొన్నారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని పాల్వంచ గ్రామ శివారులో గురువారం నిర్వహించిన బీజేపీ మహిళా శక్తి సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల తలరాతలు మార్చడంలో బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. మాయమాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీముబార్ సాయంతోపాటు తులం బంగారం అదనంగా ఇస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఇవ్వలేదని, మహిళలకు ప్రతీనెల రూ. 2,500 ఇస్తామని చెప్పి మాట తప్పారని మండిపడ్డారు. దేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హయాంలో ఆవాస్ యోజన కింద 4 కోట్ల ఇళ్లు నిర్మించి ఇచ్చారని తెలిపారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ఇంటింటికి మరుగుదొడ్లను నిర్మించుకునేందుకు సాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉజ్వల పథకంలో భాగంగా ఉచితంగా గ్యాస్ అందజేస్తున్నారని తెలియజేశారు. మహిళలు రాజకీయంగానూ ఎదగాలనే 33 శాతం రిజర్వేషన్ ఇస్తున్నదని అన్నారు. కేంద్ర మంత్రిత్వశాఖల్లోనే కీలకమైన ఆర్థికశాఖను నిర్మలసీతారామన్‌కు కేటాయించడం ద్వారా మహిళలకు దేశాన్ని నడిపే సత్తా ఉందని నిరూపించారని కొనియాడారు. పదేళ్ల పాలనలో టెక్నాలిజీని ప్రతీ ఒక్కరికి చేరువ చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రమేందర్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్, జహీరాబాద్ బీజేపీ కో కన్వీనర్ శోభారాణి, మహిళా నాయకులు సుధా, శ్రీలత, వచన పాటిల్, కామారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు అరుణతార, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను ఇంటికి పంపాలి

- రఘునందన్‌రావును ఢిల్లీకి పంపుదాం
- వికసిత తెలంగాణ కోసం బీజేపీని గెలిపించాలి
- గోవా సీఎం ప్రమోద్ సావంత్ పిలుపు
- బీఆర్ఎస్‌కు ఒక్క సీటులోనూ డిపాజిట్ రాదు
- మెదక్ గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 18: ప్రజలను దోచుకున్న బీఆర్ఎస్‌ను, హామీలు అమలు చేయని కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపించాలని, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును అత్యధిక మెజార్టీతో ఢిల్లీకి పంపాలని గోవా సీఎం ప్రమోద్ సావంత్ పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు నామినేషన్ సందర్భంగా గురువారం సాయంత్రం నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సొమ్మును దోచుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని కలెక్టర్ నుంచి ఎమ్మెల్సీ చేశారని, ఇప్పుడు తెలంగాణను దోపిడీ చేసేందుకు ఎంపీ టికెట్ ఇచ్చారని ఆరోపించారు. మెదక్‌కు కేటాయించిన అభివృద్ధి పనులను మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటకు తరలించుకుపోయారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు.


ర్యాలీలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు, పక్కన ప్రమోద్ సావంత్, కిషన్‌రెడ్డి

వికసిత్ భారత్.. వికసిత్ తెలంగాణ కోసం రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలను గెలిపించాలని కోరారు.

మెదక్‌పై కాషాయ జెండా

హామీలు అమలు చేయని కాంగ్రెస్ నేతలు ప్రచారం కోసం వస్తే తరిమికొట్టాలని వారు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నిన్నటి పార్టీ అని.. నేడు.. రేపు దాని అవసరం లేదని ఎద్దేవా చేశారు. పైసలకు ఓట్లు రావని, దేశంలో మోదీ రాజ్యం నడుస్తోందని, ప్రధానిగా మోదీని దేశ ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. మెదక్ నుంచి ఒకప్పుడు టైగర్ నరేంద్రను గెలిపించారని.. ఇప్పుడు టైగర్ రఘునందన్‌రావును గెలిపించాలని, ఇందుకోసం రానున్న 25 రోజులు కష్టపడి పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రామరాజ్యం రావాలంటే మోదీ ఉండాలి

రామరాజ్యం రావాలంటే మోదీ ప్రధానిగా ఉండాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో డబ్బును నమ్ముకొని బీఆర్ఎస్.. కులాన్ని నమ్ముకొని కాంగ్రెస్ వస్తున్నాయని.. ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఎమ్మెల్సీ పదవి తెచ్చుకున్న వెంకట్రామిరెడ్డి తన గురించి ఏం మాట్లాడతాడని ప్రశ్నించారు. పోలీసులు లేకుండా మల్లన్నసాగర్ ముంపు గ్రామాలకు వస్తే తేల్చుకుందామని సవాల్ విసిరారు. దుబ్బాకలో గెలువని రఘునందన్ మెదక్‌లో గెలుస్తాడని అంటున్న హరీశ్.. దమ్ముంటే మీ మామ కేసీఆర్‌ను రమ్మను అని సవాల్ చేశారు. మోదీ గ్యారెంటీ అంటే అమలయ్యే గ్యారెంటీ అని స్పష్టం చేశారు. ఈసారి దేశంలో బీజేపీ 400 ఎంపీ సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం 25 రోజులు పాటు పార్టీ శ్రేణులు రామ నామం.. మోదీ జపం చేయాలని పిలుపునిచ్చారు.

అంతకుముందు లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లా కేంద్రమైన మెదక్‌లో గురువారం బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. దాదాపు 30 వేల మందితో స్థానిక సాయిబాలజీ గార్డెన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆటోనగర్, పాత బస్టాండ్ మీదుగా రాందాస్ చౌరస్తా వరకు సాగింది. రఘునందన్‌రావు, పార్టీ ముఖ్యులు ఓపెన్‌టాప్ జీప్‌లో నిల్చుని ప్రజలకు అభివాదం చేశారు. ఈ ర్యాలీలో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, గోదావరి అంజిరెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి లక్ష్మీనర్సయ్య, కన్వీనర్ సంగమేశ్వర్, వివిధ మోర్చాల అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్ మధు, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, జిల్లా నాయకులు శ్రీపాల్, నాగరాజు, శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌ను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

● కాంగ్రెస్ సిద్దిపేట అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 18: గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కాంగ్రెస్ సిద్దిపేట అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన లక్ష్మాపూర్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారివెంట గ్రామశాఖ అధ్యక్షుడు ప్రభాకర్, మోహన్నగారి రాజు, నరసింహరెడ్డి, ప్రమోద్ ఉన్నారు. గజ్వేల్ మండల పరిధిలో దిలాల్‌పూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని తూంకుంట నర్సారెడ్డి దర్శించుకున్నారు. ఆయనవెంట టీపీసీసీ కార్యదర్శి, అడ్వకేట్ బెజుగామ గోపాల్‌రావు, శివరాంరెడ్డి, మోహన్నగారి రాజు, జంగం రమేశ్‌గౌడ్, నక్కరాములు గౌడ్, సొక్కం సురేశ్ తదితరులున్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన మంగలి శ్రీరాం నర్సింహులు ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న తూంకుంట నర్సారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు.



గజ్వేల్‌లో నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

● కుకునూరుపల్లి: మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గురువారం అక్బర్‌పేట భూంపల్లిలో కుకునూరుపల్లి మండలానికి చెందిన మంగోల్ గ్రామ మాజీ ఎంపీటీసీ భర్త యేళ్ల శ్రీనివాస్‌రెడ్డి, లక్దారం మాజీ సర్పంచ్ భర్త కందూరి ఐలయ్య, మహేందర్, రవి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి షైనంపల్లి హన్మంతరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రెడ్డమైన రవీందర్, నరసింహచారి, రవీందర్ పాల్గొన్నారు.



నంగునూరులో మాట్లాడుతున్న సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ



నారాయణరావుపేట: పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ముద్దం లక్ష్మి

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం..

నంగునూరు, ఏప్రిల్ 18: కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పిలుపునిచ్చారు. గురువారం నంగునూరులోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలాగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఖాతా, ఘనపూర్, సిద్దన్నపేట, రాంపూర్, ధర్గపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి మక్బూద్,టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, పార్టీ మండల అధ్యక్షుడు తప్పేట శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అచ్చిన సత్తయ్య, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పూజల గోపి కృష్ణ, నాయకులు వాహబ్, శ్రీకాంత్, మంద పాండు, ఎంగందుల యాదగిరి, మహిళా కాంగ్రెస్ జిల్లా నాయకులు జహీదా బేగం, బీసీ సెల్ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాగుల కృష్ణ, చెలికాని యాదగిరి, రంగు అశోక్, యాదగిరి, గినేపల్లి శివ, ముస్త్యాల యాదగిరి పాల్గొన్నారు.

● ములుగు: కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త అన్నారు. గురువారం హైదరాబాద్‌లో మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్ భూపాల్‌రెడ్డి, నల్లా శ్రీనివాస్, రాజుయాదవ్, చంద్రం, గుమ్మడి కిష్టయ్య, రాములు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● జగదేవ్‌పూర్: మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి, బహుజన బిడ్డ నీలం మధు గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ తీన్మార్ మల్లన్న కోరారు. గురువారం జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకులు ఉప్పల ప్రవీణ్‌గుప్త, నితీష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రవీణ్, కరుణాకర్‌రెడ్డిలు హైదరాబాద్‌లో తీన్మార్ మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు.

నమ్మకంతోనే పార్టీలో చేరికలు

నారాయణరావుపేట, ఏప్రిల్ 18: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేసిందని, కాంగ్రెస్‌పై నమ్మకంతో రోజురోజుకూ పార్టీలో చేరికలు పెరుగుతున్నాయని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి అన్నారు. గురువారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో వివిధ పార్టీల నుంచి 40 మంది మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు రేణుక, ప్రధాన కార్యదర్శి మంద వనజ, నాయకులు కాంతయ్య, అశోక్ పరుశరాములు, బాలయ్య పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వైద్యురాలికి గాయాలు

చేర్యాల, ఏప్రిల్ 18: చేర్యాల మండలం గుర్జకుంట శివారులో ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు కాశెట్టి మంజులకు తీవ్రగాయాలయ్యాయి. గురువారం ఉదయం డ్యూటీ కోసం గుర్జకుంట గ్రామం నుంచి బైక్‌పై చేర్యాలకు వస్తున్నారు. వీరన్నపేట గ్రామానికి చెందిన పవన్ బైక్‌పై వెళుతూ, గ్రామ శివారులో ఆమె బైక్‌ను ఎదురుగా ఢీ కొనడంతో కిందపడిపోయారు. దీంతో మంజుల కాలు విరిగి తీవ్రగాయాలవడంతో సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పవన్‌కు స్వల్పగాయాలయ్యాయి.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు

● దుబ్బాక సీఐ శ్రీనివాస్



మిరుదొడ్డిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మిరుదొడ్డి, ఏప్రిల్ 18: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల జరిగే విధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం మిరుదొడ్డిలోని ప్రధాన వీధుల గుండా కేంద్రబలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల దృశ్య కేంద్రబలగాలతో కవాతును నిర్వహిస్తున్నామన్నారు. ఓటు హక్కును ప్రజలు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మిరుదొడ్డి, దుబ్బాక ఎస్ఐ పరుశురాములు, గంగరాజు, రవికాంత్‌రావు, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం తథ్యం

● ములుగు మండల ఇన్‌చార్జి సింగం సత్తయ్య



గజ్వేల్ నుంచి ర్యాలీకి బయలుదేరి వెళ్తున్న బీజేపీ నాయకులు

ములుగు, ఏప్రిల్ 18: ముచ్చటగా మూడోసారి కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కావడం తథ్యమని బీజేపీ ములుగు మండల ఇన్‌చార్జి సింగం సత్తయ్య అన్నారు. గురువారం బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మెదక్‌లో నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి భారీ సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు తరలివెళ్లారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ ముదిరాజ్, భాగ్యలక్ష్మి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● గజ్వేల్: బీజేపీ అభ్యర్థిగా రఘునందన్‌రావు మెదక్ పట్టణంలో నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి గజ్వేల్ నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ బీజేపీ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు మెదక్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మనోహర్ యాదవ్ మాట్లాడుతూ.. మెదక్‌లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, నాయిని సందీప్, మర్కంటి ఏగొండ, శ్రీధర్, ప్రసాద్, నాయిని సందీప్, ఎల్ల కృష్ణ, కుంకుమరాణి, నరేందర్ తదితరులున్నారు.

● మర్కుక్: మెదక్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఎం. రఘునందన్‌రావు నామినేషన్ ర్యాలీకి మర్కుక్ మండల బీజేపీ అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో మర్కుక్ మండల బీజేపీ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు తాడూరి మహేశ్‌గౌడ్, శ్రీనివాస్, రమేశ్, రాజేందర్‌సింగ్, కుంట సత్యం, బాలకృష్ణ, పంజా మదు, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఉత్తరాలు రాసిన రైతులు



నంగునూరు మండలం రాంపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పోస్టుకార్డుతో నిరసన తెలుపుతున్న రైతులు

నంగునూరు, ఏప్రిల్ 18: రైతులకు కనీస మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వాలని రైతులు చేస్తున్న పోస్టుకార్డు ఉద్యమం గురువారం మండలంలో కొనసాగింది. మండలంలోని రాంపూర్ రైతులు పంటకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ వెంటనే ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ 2 లక్షల వరకు వెంటనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలన్నారు. అధికారం కోసం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో రైతులే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

'మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి'

గజ్వేల్, ఏప్రిల్ 18: మున్నూరు కాపులు ఆర్థికంగా, రాజకీయంగా సంఘటితం కావాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు నరేష్‌బాబు పిలుపునిచ్చారు. గజ్వేల్ మండలం బెజుగామ గ్రామంలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపులు ఐక్యంగా సంఘటితం కావాలని, పేద మున్నూరు కాపులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలన్నారు. ఇప్పటికే రాష్ట్ర మున్నూరు కాపు సంఘం పేదలను ఆదుకోవడానికి, విద్యార్థులను ప్రోత్సహించడానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందా నర్సింలు, బండ్ల స్వామి, కోశాధికారి గంగిశెట్టి నరసింహులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాదే నరసింహులు, ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, కోశాధికారి నక్కిర్త శ్యామ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, నక్కిర్త సత్య నారాయణ, సలహాదారులు నక్కిర్త బాలయ్య, భూమయ్య, ముత్తయ్య, నర్సింహులు, దేవేందర్, ఆకుల యాదగిరి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించాలి

మనోహరాబాద్, ఏప్రిల్ 18: జాతీయ స్థాయిలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి బాలుర, బాలికల జట్టు విజయం సాధించాలని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు అన్నారు. మనోహరాబాద్ క్రీడా ప్రాంగణంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. తెలంగాణలో ఉన్న సుమారు 16 జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన బాలురు, బాలికల క్రీడాకారులకు ఈ నెల 20 నుంచి 27 వరకు ఇక్కడే శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 28 నుంచి 30వరకు కర్నాటక రాష్ట్రంలోని టు మార్క్‌లో జరిగే 3వ జాతీయ స్థాయి సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని శోభన్‌బాబు తెలిపారు.



మనోహరాబాద్ క్రీడా ప్రాంగణంలో సాఫ్ట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా బండారు శ్రీకాంత్‌రావు

గజ్వేల్, ఏప్రిల్ 18: మెదక్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావును మెదక్ పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ, టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ ఛైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రావు మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా నియమించిన టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషిచేస్తానన్నారు.

విద్యావాలంటీర్ల వేతనం చెల్లించిన ఎన్ఆర్ఐ

చేర్యాల, ఏప్రిల్ 18: చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ, షై విలేజ్ ఫౌండేషన్ ప్రతినిధి ఏనుగుల ప్రభాకర్, గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న విద్యావలంటీర్లకు 3 నెలల గౌరవ వేతనాన్ని విరాళంగా అందించారు. ఈమేరకు గురువారం అతడి తరఫున ఫౌండేషన్ సభ్యులు పాఠశాల హెచ్ఎం గోవిందరాజుకు అందజేశారు.

మంత్రిని కలిసిన నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 18: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గురువారం పలువురు చేర్యాల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు తదితరులు మంత్రి కోమటిరెడ్డితో స్థానికంగా పార్టీ స్థితిగతులను ఏకరువు పెట్టారు. మూడు, నాలుగు దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని కష్టపడిన వారిని దూరంపెడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ తమలాంటి వారికి కనీస గుర్తింపు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ. ఖాజా, ఎలుగల దుర్గయ్య, బొడిగం నర్సిరెడ్డి, ఎండీ. జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరిని కలిసిన నాగపురి

చేర్యాల, ఏప్రిల్ 18: కొద్దిరోజుల క్రితం బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాగపురి కిరణ్‌కుమార్ గురువారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ

● సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి సురేష్



అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గజ్వేల్‌టౌన్, ఏప్రిల్ 18: అవగాహనతో అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి సురేష్ అన్నారు. అగ్నిమాపక శాఖ నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం గజ్వేల్‌లోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన, మాక్‌డ్రిల్ నిర్వహించారు. సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి మాట్లాడుతూ.. సిబ్బంది, డెలివరీ బాయ్స్‌కి ఎల్పీజీ సిలిండర్ నిల్వ చేసే సమయంలో, రవాణ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే దానిని నివారించడానికి కావాల్సిన సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అగ్నిప్రమాదం జరిగితే 101 లేదా దగ్గర్లోని ఫైర్ స్టేషన్ నెంబర్ 8712699254 సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ అగ్నిమాపక కేంద్ర అధికారి కుమార్, ఫైర్‌స్టేషన్ సిబ్బంది, ఎల్పీజీ గోడౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల రథోత్సవం



వడ్డేపల్లిలో సీతారాముల రథాన్ని లాగుతున్న భక్తులు


రాయపోల్, ఏప్రిల్ 18: మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో గురువారం ఉదయం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామంలోని వీధుల గుండా రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మహిళలు బోనాలు సమర్పించి పోచమ్మతల్లికి మొక్కులు తీర్చుకున్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 18: మండలంలోని దౌలాపూర్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవచనం చేసి దేశ గురువు యాగశాల ప్రదర్శనతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం మండపారాధన, కలశస్థాపన, దేవతవాహనం, అంకురార్పన, అఖండ దీపారాధన, విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. గణపతిహోమం, వాస్తు హోమం, నవగ్రహ యంత్ర పూజలు, మృత్యుంజయ, దుర్గలక్ష్మి సహిత దేవత పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేశ గురువులు బండి కేశవరెడ్డి, సర్వేపల్లి విజయభాస్కర్‌రెడ్డి, గ్రామ పురోహితులు శ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంజీవరెడ్డి, యాదవరెడ్డి, ఉప్పల్‌రెడ్డి, సాయిలు, బోయిన పుల్లయ్య, జయమ్మ ఉన్నారు.

శివాలయ నిర్మాణానికి శంకుస్థాపన

మద్దూరు, ఏప్రిల్ 18 : మండలంలోని సలాఖ్‌పూర్ గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో శివాలయ నిర్మాణానికి రిటైర్డు ఉపాధ్యాయ దంపతులు కామిడి బాల్‌రెడ్డి జయమ్మ దంపతులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడారు. ఆలయాన్ని తన సొంతఖర్చులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆ శివుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంగ భాస్కర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలోని హిందుస్థాన్ పెట్రోలియం పెట్రోల్‌బంక్ వద్ద డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. నెల రోజుల క్రితం ఓ భారీ వాహనం ఆ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం అలా ప్రమాదకరంగా మారింది. విద్యుత్ స్తంభం ఇటు రోడ్డుపై పడిన అటు వాహనాలపై పడినా భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. దీనిపై రోడ్డు బాధ్యతలు చూస్తున్న దుద్దెడ హెచ్‌కేఆర్ ప్రతినిధులను సంప్రదించగా స్తంభాన్ని సరిచేస్తామని తెలిపారు.

- కుకునూరుపల్లి

ఎన్నికల నిబంధనలను అతిక్రమించవద్దు

● అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రామ్మూర్తి

హుస్నాబాద్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల నిబంధనలను అతిక్రమించకుండా, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని హుస్నాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రామ్మూర్తి పార్టీల నాయకులను కోరారు. గురువారం ఆయన పట్టణంలోని ఐఓసీ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో జరిగిన ఎన్నికల అవగాహన సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఉంటుందన్నారు.

సెక్టోరియల్ అధికారులతో సమావేశం

ఎన్నికలపై సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వారికి ఎన్నికల విధులు, బాధ్యతలపై వివరించారు. సెక్టోరియల్ అధికారులు డిస్ట్రిబ్యూషన్, కమిషనింగ్ రోజున తప్పకుండా ఉండాలని ఆదేశించారు. ఈవీఎంలపై అవగాహన ఉండాలని సూచించారు. పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో తహసీల్దార్లు రవీందర్‌రెడ్డి, సురేఖ, సంజయ్‌కుమార్, మంజుల, రుక్మిణి, మహ్మద్ రజాక్, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ నోటీసు బోర్డుపై పార్లమెంట్ ఎన్నికల ఫామ్ 1 నోటిఫికేషన్‌ను అతికించారు.



సెక్టోరియల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రామ్మూర్తి

ఆయిల్ పాం, వరివేద సాగుపై క్షేత్రస్థాయి అవగాహన



డీలర్లతో మాట్లాడుతున్న అధికారులు

మర్కుక్, ఏప్రిల్ 18: మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో వరివేద సాగు, ఆయిల్ పాం తోటలపై సిద్దిపేట జిల్లా డీలర్లకు మర్కుక్ మండల వ్యవసాయాధికారి టీ. నాగేందర్‌రెడ్డి గురువారం క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిలో వేదసాగు వల్ల రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు సరైన సమయంలో విత్తనాలు వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని, రైతులు నీటి యాజమాన్యం, పురుగుల యాజమాన్యంతో తగిన జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. ఆయిల్‌పాం తోటలో మొక్కల మధ్య దూరం ఎక్కువ ఉంటే తొలి 3 సంవత్సరాల కాలంలో అంతర పంటలు వేసి, రైతులు బహుళ ఆదాయం పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో దేశీ కోఆర్డినేటర్ శంకర్‌రావు, విజయ్, వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

హుస్నాబాద్ ఫుల్ జోష్..

● ఊపందుకున్న ప్రచారం

● పోటాపోటీగా పార్టీల ప్రచార రథాల హోరు..

● ఇంకా ఖరారు కాని కాంగ్రెస్ అభ్యర్థి పేరు




హుస్నాబాద్, ఏప్రిల్ 18: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం హుస్నాబాద్ నియోజకవర్గంలో ఊపందుకున్నది. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల పేర్లు ఖరారు కావడంతో ఇరు పార్టీల నాయకులు పోటాపోటీగా ప్రచారం సాగిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్, బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌లు ప్రచార రథాలు ఏర్పాటు చేసుకుని వారం రోజుల ముందు నుంచే నియోజకవర్గంలో హోరెత్తిస్తున్నారు. ఇదే కాకుండా ఈ పార్టీల ముఖ్య నాయకులు కార్యకర్తల సమావేశాలు, ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది ఇంకా ఖరారు కాకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొన్నది. బీజేపీ, బీఆర్ఎస్‌ల ప్రచారం ఊపందుకోగా కాంగ్రెస్ ఇంకా ప్రచారం షురూ చేయలేదు. నేడో, రేపో అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందని, అందుకే శుక్రవారం హుస్నాబాద్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారని చర్చించుకుంటున్నారు. ఏ నాయకునికి టికెట్ వచ్చినా గెలిపించుకోవాలని కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా నియామకం అయ్యారు. హుస్నాబాద్‌లో మెజార్టీ ఓట్లు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు కాంగ్రెస్‌ను మించి ఓట్లు తీసుకరావాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఎప్పటికప్పుడు కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎంపీ బండి సంజయ్‌ని మరోసారి గెలిపించుకోవాలని నాయకులు, కార్యకర్తలు తమదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. ఏదేమైనా నామినేషన్ల ఘట్టం మొదలు కావడంతో ప్రధాన పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి.

మూడు జిల్లాలతో ముడి

కరీంనగర్ పార్లమెంట్‌లోని హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాలతో ముడిపడి ఉంది. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట సిద్దిపేట జిల్లాలో, చిగురుమామిడి, సైదాపూర్ కరీంనగర్ జిల్లాలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలు హన్మకొండ జిల్లాలో ఉన్నాయి.

పారిశుధ్య కార్మికులకు అందని వేతనాలు


● నెలలుగా తప్పని ఎదురుచూపు



దౌల్తాబాద్ మండలం దొమ్మాటలో పారిశుధ్య పనులు చేస్తున్న గ్రామ కార్మికులు(ఫైల్)

దౌల్తాబాద్, ఏప్రిల్ 18: మండలంలోని దౌల్తాబాద్, తిర్మలాపూర్, గాజులపల్లి, ఇందుప్రియల్, మచిన్‌పల్లి, ముబారస్‌పూర్ తదితర గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు నెలలు గడుస్తున్నా జీతాలు రాక కొట్టుమిట్టాడుతున్నారు. మురుగును చూస్తే ముక్కు మూసుకునే ఈ రోజుల్లో నిత్యం మురుగుతో పాటు, వ్యర్థాలను తొలగిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతారు. దౌల్తాబాద్ మండలంలోని 75 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వీరికి నెలకు రూ.9500 వేతనం అందుతుంది. కానీ గత 2 నుంచి 6 నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతున్నదని కార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఒకటో తారీఖున వేతనాలు ఇవ్వాలి



ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్నట్లు ప్రతీ నెల ఒకటిన పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలి. పంచాయతీ నిధులతో సంబంధం లేకుండా వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. వేతనాలు రాకపోతే పారిశుధ్య పనులు నిలిపివేస్తాం ఆందోళనలు, ధర్నాలు చేపడతాం.

- సంబగ బాల్‌రాజు, సీఐటీయూ జిల్లా నాయకులు, దౌల్తాబాద్